
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కడప

జిల్లా వార్తలు

5

శనివారం 20 జూలై 2024

పోలీస్ బాస్.. ఎస్బీ..!

- వైసీపీ హయాంలో వాళ్లు చెప్పించే వేదం
- పోలీసు వ్యవస్థ నిర్వీర్యం
- పోలీసులపైనే దాడులు..
- అయినా చర్యలు శూన్యం
- డమ్మీలుగా నాటి ఎస్పీలు
- కొత్త ఎస్పీ స్వతంత్రంగా వ్యవహరించేనా?

(కడప-ఆంధ్రజ్యోతి): ఎస్బీ అంటే స్పెషల్ బ్రాంచ్. ఎస్పీకి కళ్లు, చెవులు లాంటిది. జిల్లాలో ముందస్తుగా జరగబోయేది, జరిగింది, జరిగిపోయింది ఎస్బీకి తెలిసేది. ఒక విషయం చెప్పాలంటే వీళ్లు కూడా మీడియాలాంటి వారే. ఎస్పీకి అత్యంత కీలకమైన బ్యాచ్. అలాంటి కీలకమైన వ్యవస్థ కొందరిచేతుల్లో ఉంది. చట్టాన్ని న్యాయాన్ని కాపాడాల్సిన బ్యాచ్ వైసీపీకి దాసోహం అయిపోయింది. ఎంతలా అంటే ఎస్పీలనే డమ్మీలు చేసేంతగా.. గతంలో ఎన్నడూ లేనివిధంగా జగన్ పాలనలో పోలీస్ వ్యవస్థ నిర్వీర్యం అయిపోయింది. రౌడీలు, గూండాలకు ఉచ్చపోయించిన కడపజిల్లా పోలీస్ బాస్‌లు.. గత ఐదేళ్లలో వైసీపీ నేతలు పేరు చెబితేనే వణికిపోయే వారంటారు. జగన్ పాలనలో ఎస్పీ అన్బురాజన్ సుదీర్ఘ కాలం పనిచేశారు. అనంతరం సిద్ధార్థ్ కౌశల్ వచ్చారు. వీరు పేరుకే ఐపీఎస్‌లు.. వీరి తీరంతా వైసీపీ నేతలు అనేలా పేరు తెచ్చుకున్నారు. ఎస్పీ అన్బురాజన్ అప్పుడప్పుడు బయటకు వచ్చి కొన్ని సామాజిక సేవల్లో పాల్గొనేవారు. కరోనా సమయంలో అభాగ్యులకు అన్నదానం చేయడం, నిత్యావసర సరుకులు పంపిణీచేసి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. అయితే పులివెందుల పవర్‌లో చిక్కుకుని విలవిల్లాడారంటారు. ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ త్వరితగతినే విమర్శలు ఎదుర్కొన్నారు. ఈ ఇద్దరు ఎస్పీలనూ ఎస్బీనే మానిటరింగ్ చేసిందంటారు.

పులివెందుల ఆశీస్సులతో..

ఎస్పీ అంటే జిల్లా పోలీసులకు బాస్. అయితే జగన్ హయాంలో ఎస్పీ అంటే ఎస్బీగా మారిపోయిందంటారు. ఎస్పీ కింద స్పెషల్ బ్రాంచ్ (ఎస్బీ) పనిచేయాల్సి ఉండగా.. ఎస్బీ కిందనే ఎస్పీలు పనిచేశారనే ఆరోపణలు వచ్చాయి. ఎస్బీలో పులివెందుల వైసీపీ పెద్దల ఆశీస్సులతో పోస్టు తీసుకుని చక్రం తిప్పారంటారు. ఎస్బీలో పనిచేస్తున్న అశోక్‌రెడ్డి, రాజు కడపజిల్లా వ్యాప్తంగా పోలీస్ డిపార్ట్‌మెంట్‌ను శాసించారని, వీరంతా వైసీపీకి ఊడిగం చేశారని అంటారు. జనాల సొమ్ముతో జీతాలు తీసుకునే పోలీసులు, ఎస్బీలో పనిచేసే వారు తాము ప్రభుత్వ ఉద్యోగులమని మరచి వైసీపీ బ్యాచ్‌గా పనిచేసి తీవ్ర విమర్శలు మూటగట్టుకున్నారు. కడప జిల్లా పోలీసు వ్యవస్థపై గతంలో ఎప్పుడూ లేనన్ని ఆరోపణలు జగన్ పాలనలో వచ్చాయి.

ఎస్బీ చేతిలో ఎస్పీలు డమ్మీ

జిల్లా పోలీస్ యంత్రాంగానికి సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ) బాస్. శాంతి భద్రతల పర్యవేక్షణ ఈయనదే. అలాంటి ఎస్పీలను ఎస్బీలో పనిచేసే కొందరు డమ్మీ చేశారనే విమర్శ వుంది. వైసీపీ సైన్యం పోలీసులనే చితక్కొట్టినా చర్యలు లేవు. వరుసగా పోలీసులపై జరిగిన దాడులు చూసి సామాన్య జనమే అయ్యోపాపం పోలీసులనే కొడుతన్నారు. ఈ వైసీపీ వారికి ఏం పోయే కాలం వచ్చిందంటూ చర్చించుకున్న సందర్భాలున్నాయి.

ఖాకీలను చితక్కొట్టినా కూడా తోటి ఖాకీలు స్పందించక పోవడం తీవ్ర విమర్శలకు దారితీసింది. ఎస్బీ చేతిలో ఎస్పీలు డమ్మీలుగా మారడం, పులివెందుల పవర్ ఎఫెక్ట్‌తో పోలీసులను చితక్కొట్టినా కూడా పట్టించుకోలేకపోయారు. ఎస్పీ అన్బురాజన్, సిద్ధార్థ్ కౌశల్ హయాంలోనే పోలీసులపై దాడులు జరిగాయి.

> గత ఎస్పీలు ఇద్దరూ ఎస్బీ చేతిలో డమ్మీగా మారడంతో పోలీసులపైనే దాడులు జరిగాయనే విమర్శలున్నాయి. కీలకమైన ఎస్బీలో పులివెందుల పెత్తనంతో కొందరు సీఐలు ఎస్పీలనే డమ్మీచేసి వాళ్లు హీరోలుగా చలామణి అయ్యారంటారు. మరి కొత్త ఎస్పీ హర్షవర్ధన్‌రాజు రెండు రోజుల క్రితం బాధ్యతలు చేపట్టారు. మరి ఈయన పోలీస్ డిపార్ట్‌మెంట్‌ను ఎలా నడిపిస్తారు..? ఎస్బీని ప్రక్షాళన చేస్తారా..? రాజకీయ నాయకుల చేతుల్లో డమ్మీగా మారతారా..? లేక నిష్పాక్షికంగా ప్రజలకు సేవ చేస్తారా అనేది వేచి చూడాల్సి ఉంది.





డిసెంబరు 9వ తేదీన పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ కుర్చీలో కూర్చుని ఎస్ఐని దబాయిస్తున్న అప్పటి ఎమ్మెల్యే రాచమల్లు

జిల్లాలో కొన్ని సంఘటనలు పరిశీలిస్తే..

- అన్నమయ్య జిల్లాలో ఎస్బీ సీఐగా పనిచేసిన అనిల్‌కుమార్ కడపలోని కో-ఆపరేటివ్ కాలనీ నెహ్రూపార్క్ సమీపంలో నివాసం ఉంటున్నారు. అక్కడికి సమీపంలో వైసీపీ నేతకు చెందిన హోటల్‌లో పనిచేసే కార్మికులు ఈయన ఇంటిపక్కనే బాడుగకు ఉండేవారు. వీరు రోజూ రాత్రి వేళ అల్లరి చేస్తుండడంతో ఆయన వారించారు. అంతే.. సీఐ అని కూడా చూడకుండా గత ఏడాది డిసెంబరు 9న కర్రలతో ఆయనను చితక్కొట్టారు. ఈ సంఘటన కలకలం రేపింది. హోటల్ ఓనరే రెచ్చగొట్టే విధంగా మాటలు మాట్లాడాడంటారు. హోటల్ వైసీపీ వారిది కావడంతో పోలీసులు తీసుకున్న చర్యలు నామమాత్రమే. బాధితులపైనే కేసు నమోదు చేశారు.
- ప్రొద్దుటూరులో అధికారికంగా ఇసుక రీచ్‌లు లేవు. అయినా సరే.. ఇక్కడి పెన్నానదిలో వైసీపీ నేతల ఆధ్వర్యంలో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా సాగేది. అలా ఓ అర్ధరాత్రి ఇసుక రవాణా చేసే పైలట్ వాహనాలను అడ్డుకున్నందుకు ఎస్సై హైమావతిపై రాళ్లదాడి చేశారు.
- అనుమతుల్లేకుండా అధికమొత్తంలో మద్యం బాటిళ్లను తీసుకెళుతున్న ఓ వ్యక్తిని ప్రొద్దుటూరులో పోలీసులు అరెస్టు చేశారు. దీంతో అప్పటి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఎస్బీ స్టేషన్ కెళ్లి ఎస్ఐ కుర్చీలో కూర్చున్నారు. ఆయన అనుచరులందరూ మిగిలిన కుర్చీల్లో కూర్చున్నారు. దీంతో ఎస్ఐ నిల్చునే ఎమ్మెల్యేతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 'ఎస్పీ అమ్మ మొగుడుకు కావాలంటే చెప్పుకోపో' అని కూడా అన్నారు. అప్పట్లో ఎస్పీగా సిద్ధార్థ్ కౌశల్ ఉన్నారు. అయినా ఆయనపై ఎలాంటి చర్యలూ లేవు.
- వేంపల్లి నుంచి ఇసుక అక్రమ రవాణా సాగుతుందేది. ఈ విషయాన్ని ఫొటోలు తీసి వార్త రాసేందుకు విలేకరులు వెళ్లగా వారిపైనే కేసు నమోదు చేశారు. వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తలు రాయడంతో పులివెందుల పవర్ కారణంగా వీరిపై కేసులు నమోదు చేశారని ప్రచారం సాగింది. సిద్ధార్థ్ కౌశల్ వచ్చిన కొత్తలోనే విలేకరులపై కేసు నమోదైంది.

క్షేత్రస్థాయిలో కచ్చితమైన సమాచారం ఇవ్వండి

- స్పెషల్ బ్రాంచ్ సిబ్బందితో సమీక్షించిన ఎస్పీ

కడప (క్రైమ్), జూలై 19: రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని, క్షేత్రస్థాయిలో కచ్చితమైన సమాచారాన్ని తనకు అందజేయాలని ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఆదేశించారు. స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది తనిఖీలపై శుక్రవారం పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని పోలీస్ స్టేషన్లలో జరుగుతున్న సంఘటనలు, పాస్‌పోర్టుల పరిశీలన వివరాలను ఎప్పటికప్పుడు తనకు అందించాలని ఆదేశించారు. విధుల పట్ల ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం స్పెషల్ బ్రాంచ్ సిబ్బందికి ఆయన పలు సూచనలు అందజేశారు. ఈ సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సుధాకర్, సీఐ వెంకటకుమార్, ఎస్ఐ రాజరాజేశ్వరరెడ్డితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్యాక్షన్‌పై నిఘా

- ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా
- కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్
- బాధ్యతలు స్వీకరణ



డీఐజీ కోయ ప్రవీణ్‌ను కలిసిన ఎస్పీ హర్షవర్ధన్ రాజు

కర్నూలు, జూలై 19: శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఫ్యాక్షన్ ప్రభావిత ప్రాంతాల మీద పటిష్ఠ నిఘా ఏర్పాటు చేస్తామని కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ తెలిపారు. శుక్రవారం ఉదయం కర్నూలు రేంజ్ డీఐజీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. ముందుగా ఏఆర్ పోలీసు సిబ్బందిచే గౌరవ వందనం స్వీకరించారు. పురోహితులు డీఐజీకి ఆశీస్సులు అందజేశారు. అనంతరం బాధ్యతలు స్వీకరించిన డీఐజీని కర్నూలు ఎస్పీ జి.బిందుమాధవ్, నంద్యాల ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా, కడప ఎస్పీ వి. హర్షవర్ధన్‌రాజు, అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ మహేశ్‌కుమార్, అడిషనల్ ఎస్పీలు, డీఎస్పీలు, సీఐలు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం డీఐజీ ప్రవీణ్ విలేకరులతో మాట్లాడుతూ కర్నూలు రేంజ్ డీఐజీగా రాయలసీమకు రావడం ఇదే మొదటిసారి అన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం కర్నూలు రేంజ్ పరిధిలోని కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాల పోలీసులతో సమన్వయం చేసుకుంటూ టీమ్ వర్క్ చేస్తామన్నారు. ప్రశాంత వాతావరణం నెలకొల్పడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామన్నారు.

డీఐజీ గురించి

స్వగ్రామం పశ్చిమ గోదావరి జిల్లా పోలవరం. 2009లో సివిల్స్ రాసి ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. అసాల్ట్ కమాండర్ గ్రేహౌండ్స్, ఖాజీపేట, పార్వతీపురం, వరంగల్, విజయనగరం జిల్లాలో ఓఎస్డీగా పనిచేశారు. విశాఖపట్నం రూరల్ ఎస్పీగా, విజయవాడ సిటీ లా అండ్ ఆర్డర్ డీసీపీగా, కాకినాడ సీ-పోర్టు డైరెక్టర్‌గా, ప్రకాశం జిల్లా ఎస్పీగా, గుంతకల్లు రైల్వే ఎస్పీగా, పోలీసు ట్రాన్స్‌పోర్టు ఆర్గనైజేషన్ ఎస్పీగా, విశాఖపట్నం 16వ బెటాలియన్ కమాండెంట్‌గా, ఆక్టోపస్, పోలీస్ ట్రాన్స్ ఆర్గనైజేషన్‌లలో ఎస్పీగా పని చేశారు. ఇటీవల జరిగిన సాధారణ ఐపీఎస్‌ల బదిలీల్లో భాగంగా గ్రేహౌండ్స్‌లో డీఐజీగా పనిచేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీగా ఆయన బాధ్యతలు చేపట్టారు.

అందరి సహకారంతో వైవీయూ అభివృద్ధి

- ఇన్‌చార్జ్ వీసీగా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ కృష్ణారెడ్డి



కడప (ఎడ్యుకేషన్), జూలై 19: అందరి సహకారంతో యూనివర్శిటీ అభివృద్ధికి కృషి చేస్తానని ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన వైవీయూ ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యూనివర్శిటీ ప్రారంభం నుంచి వివిధ హోదాల్లో పనిచేసిన అనుభవం దృష్ట్యా ప్రతి విభాగంపై సమగ్ర అవగాహన ఉందన్నారు. యూనివర్శిటీని త్వరితగతిన పురోభివృద్ధి దిశగా తీసుకువెళతామన్నారు. కాగా.. ఇన్‌చార్జి వీసీగా బాధ్యతలు చేపట్టిన కృష్ణారెడ్డికి వివిధ విభాగాల అధిపతులు శుభాకాంక్షలు తెలిపారు.



ఎన్నాళ్లీలా..

ఇది నీటిమడుగు కాదు.. బావీ కాదు.. పంటకాల్వా కాదు.. ఇది జిల్లా కేంద్రమైన కడప ఆర్టీసీ బస్టాండులోకి పోయే దారి. వానొస్తే బస్టాండు జలమయంగా మారుతుంటుంది. కానీ ఇవి వర్షం నీళ్లు కాదు. అక్కడి టాయిలెట్‌ల నుంచి వచ్చే నీరంతా లీకేజీ కారణంగా ఇలా వచ్చి నిలుస్తోంది. బస్టాండులోకి ప్రవేశించడానికి రెండుదారులు ఉన్నాయి. ఒక దారి ఇలా మురుగునీటితో నిండిపోయింది. నెలల తరబడి ఈ సమస్య ఇలానే ఉంది. దీంతో బస్టాండులో బస్సులకోసం ఎదురుచూసే ప్రయాణికులు ముక్కులు మూసుకుని కూర్చోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండు వద్ద మురుగునీరు ఆగకుండా చూడాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఫొటోలు: స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కడప





బస్టాండు లోపలి వెళ్లే రోడ్డంతా మురుగునీరు నిల్వ ఉండటంతో దారి లేక ఆగిపోయిన వాహనదారుడు

పూర్వ ఆర్జేడీపై వారం రోజుల్లో నివేదిక

- అవినీతి ఆరోపణలపై ముగిసిన విచారణ
- విచారణాధికారి డాక్టర్ ఎంఆర్ ప్రసన్నకుమార్



విచారణాధికారి ప్రసన్నకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నేతలు

కడప (ఎడ్యుకేషన్), జూలై 19: పూర్వ ఆర్జేడీ రాఘవరెడ్డి అవినీతి ఆరోపణలకు సంబంధించి పూర్తి నివేదికలను వారం రోజుల్లో రాష్ట్ర విద్యాశాఖకు సమర్పిస్తామని విచారణాధికారి డైరెక్టర్ ఆఫ్ లైబ్రరీస్ ఎంఆర్ ప్రసన్నకుమార్ పేర్కొన్నారు. పూర్వ ఆర్జేడీ రాఘవరెడ్డిపై వచ్చిన అవినీతి ఆరోపణలకు సంబంధించి రెండవ రోజు శుక్రవారం సైతం కడప పాఠశాల విద్య ఆర్జేడీ కార్యాలయంలో విచారణ కొనసాగింది. కార్యాలయంలో అవినీతి ఆరోపణలకు సంబంధించి పలు రికార్డులను విచారణాధికారి పరిశీలించారు. అలాగే ఆర్జేడీ కార్యాలయం అధికారులు, సిబ్బందితో మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, డీఈఓ, ఆర్జేడీ కార్యాలయంలో విచారణ పూర్తిచేశామన్నారు. ఆరోపణలు చేసిన వారిని విచారించామన్నారు. మండల స్థాయిలో నివేదికలు సమర్పించడంలో కొంత ఆలస్యం జరిగే అవకాశం ఉందని తెలిపారు. 2016 నుంచి ఉన్న ఫైళ్లను పరిశీలించామని చెప్పారు. బాధితులు ఎవ్వరూ ఇబ్బంది పడకూడదన్న లక్ష్యంతో నాన్చుడు ధోరణి లేకుండా క్రమశిక్షణ చర్యలకు సంబంధించి గత మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వాటిని మూడు నెలల్లోపల పరిష్కరించాలని సూచించినట్లు తెలిపారు.

ఆరుగురికి షోకాజ్ నోటీసులు

రాఘవరెడ్డి అవినీతి ఆరోపణలపై జరుగుతున్న విచారణకు గురువారం ఎటువంటి అనుమతి లేకుండా వచ్చిన ఆరుగురికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆర్జేడీ, అన్నమయ్య జిల్లా డీఈఓలకు విచారణాధికారి ప్రసన్నకుమార్ సూచించారు. టి.సుండుపల్లె ఎంఈఓ వెంకటేశ్ నాయక్ పాఠశాలకు హాజరై ఎటువంటి పర్మిషన్ లేకుండా కడప డీఈఓ కార్యాలయానికి హాజరయ్యారన్నారు. ప్రధానోపాధ్యాయులు నాగమునిరెడ్డి, రామకృష్ణ, శివకుమార్‌రెడ్డిలకు నోటీసులు జారీ చేయాలని కడప పాఠశాల విద్య ఆర్జేడీకి సూచించామని తెలిపారు. అలాగే మంగంపేట స్కూల్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, ఎస్జీటీ ఆదినారాయణరెడ్డిలకు కూడా నోటీసులు జారీ చేయాలని అన్నమయ్య జిల్లా డీఈవోకు సూచించామన్నారు.

అవినీతి అధికారిపై చర్యలు తీసుకోవాలి: ఎస్టీయూ

అన్నమయ్య, కడప జిల్లాల డీఈవోగా పనిచేసిన పూర్వ ఆర్జేడీ రాఘవరెడ్డి అనినీతి అక్రమాలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఇలియాస్‌బాషా, సంగమేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శుక్రవారం ఆర్జేడీ కార్యాలయంలో విచారణాధికారి ప్రసన్నకుమార్‌ను కలసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అనర్హులను ఓటర్లుగా రాఘవరెడ్డి నమోదు చేయించారని చెప్పారు. స్కూల్ వ్యాన్ డ్రైవర్లు, అటెండర్లు, నర్సరీ టీచర్లను కూడా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లుగా నమోదు చేయించారన్నారు. ప్రభుత్వ సెక్టార్‌లోని కేజీబీవీలు, గురుకులాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లకు అర్హత లేదని వారిని ఓటర్ల జాబితాలో చేర్పించలేదని తెలిపారు. రివర్స్ పేరుతో అక్రమ బదిలీలకు తెరలేపి లక్షలాది రూపాయలు వసూలు చేశారని, అధిక హెచ్ఆర్ఏ ప్లేసుల్లో వారికి ప్లేస్‌మెంట్స్ ఇచ్చారని ఆరోపించారు.

జిల్లా ఆస్పత్రి ఆకస్మిక తనిఖీ

- శానిటేషన్, వైద్య సేవలపై సూపరిండెంట్‌తో కలెక్టర్ సమీక్ష

ప్రొద్దుటూరు, జూలై 19: ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్యసేవలపై కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. శుక్రవారం సాయంత్రం ఆయన జిల్లా ఆసుపత్రిలో నేరుగా రోగులుండే వార్డులకు వెళ్లి అక్కడ అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వార్డుల్లో శానిటేషన్ మెయింటనెన్స్ పై ప్రత్యేకంగా చర్చించారు. న్యూరో ఫిజిషియన్ లేదా సర్జన్స్, కార్డియాల జిస్ట్ అవసరముందని రోగులు తెలిపారు. చిన్నపిల్లల వైద్యు లు, గైనకాలజిస్టులు, ఫిజీషియన్స్, సర్జన్స్, ఆర్థోపెడిక్ వైద్యు లు ఎంతమంది ఉన్నారో సూపరిండెంట్ ఆనంద్‌ను అడిగి తెలుసుకున్నారు. అందుతున్న సేవలతో శానిటేషన్‌పై కూ డా సంతృప్తి వ్యక్తం చేశారు. శానిటరీ సిబ్బందికి సకాలంలో జీతాలు అందడం లేదని తద్వారా శానిటేషన్ వర్కులో వారు సంతృప్తిగా పనిచేయలేక పోతున్నారని కలెక్టరు దృష్టికి తెచ్చారు. నర్సింగ్ సిబ్బంది 27 మంది వరకు కొరత ఉందని తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులతో విడిగా కలెక్టర్ మాట్లా డారు. ఇంకా జిల్లా ఆసుపత్రిలో ఏమైనా సౌకర్యాలు మెరుగు పరచాల్సి ఉంటే తన దృష్టికి తెస్తే కార్పొరేట్ ఇండస్ట్రీయలి స్టులతో మాట్లాడి ఏర్పాటు చేస్తానన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, తహశీల్దారు విద్యాసాగర్ ఉన్నారు.



వైద్య అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

అనువు గాని చోట జగనన్న ఇళ్లు

- వంకలు, గుట్టల్లో ఇళ్ల నిర్మాణాలు
- కనీస వసతులు లేక..
- నేటికీ పూర్తికాని గృహ నిర్మాణాలు

సంబేపల్లె, జూలై 19: ప్రతి పేదవాడికి పక్కా గృహం కట్టిస్తామని గొప్పలు చెప్పిన గత వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసిందని చెప్పవచ్చు. పేదల ఇళ్లు గుట్టలు, వంకల్లో లేఅవుట్లు వేసి జగనన్న కాలనీ పేరిట నిర్మాణాలు చేపట్టారు. సంబేపల్లె మండలంలో నివాస స్థలాలకు అనువుగాని చోట జగనన్న కాలనీల పేరుతో వైసీపీ నాయకులు లేఅవుట్లు వేశారు. జంగిల్ క్లియరెన్స్ కోసం లక్షల రూపాయలు ప్రజాధనాన్ని వృధా చేశారని చెప్పవచ్చు. ఈ స్థలాల్లో అన్ని మౌలిక వసతులను కల్పించాలి. ఇక్కడ సరైన సౌకర్యాలు లేక గృహాలు పూర్తి చేయలేదు. కొన్ని గృహాలు నిర్మించినా నివాసాలు లేక దిష్టిబొమ్మల్లా ఉన్నాయి.

ఒక్క గృహం నిర్మించలేదు....

సంబేపల్లె మండలంలోని దేవపట్ల, రెడ్డివారిపల్లె, నాగిరెడ్డిగారిపల్లె గ్రామాలకు సంబంధించి సీఎం కొత్తపల్లి సమీపంలో గుట్టలో జగనన్న లేఅవుట్లు వేశారు. ఇప్పటికీ నాలుగు ఇళ్లు పూర్తి చేశారు. నివాసాలైతే లేవు. కొన్ని ఇళ్లు పునాది వేసి వదిలేశారు. దుద్యాల గ్రామం ఊరగాయగుట్ట హరిజనవాడ సమీపంలో జగనన్న లేఅవుట్లు వేసి ఇళ్లు మంజూరు చేశారు. ఇప్పటి వరకు ఒక పక్క గృహం కూడా నిర్మించలేదు. కొండకింద హరిజనవాడ ప్రాంతంలో ఒకే ఒక గృహం కట్టారు. వడ్లపల్లి సమీపంలో కొత్తచెరువు మునక ప్రాంతంలో జగనన్న లేఅవుట్ మంజూరు చేశారు. నారాయణరెడ్డిపల్లె గ్రామానికి సమీపంలో ఈ గ్రామ వాసులకు బండ సమీపంలో ఇళ్లు మంజూరు చేశారు. అధికారుల ఒత్తిడితో గృహాలు నిర్మించుకున్నా ఎవరు నివాసాలు లేక దిష్టి బొమ్మల్లా ఉన్నాయి. కొన్ని ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా గృహాలు నిర్మించారు.

సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు ఇలా...

జగనన్న కాలనీలతో పాటు సొంత స్థలాల్లో కూడా గృహాలు నిర్మించుకునేందుకు మండలానికి 1875 పక్కా గృహాలు మంజూరయ్యాయి. వాటిల్లో ఇప్పటి వరకు పూర్తి చేసినవి 664గా హౌసింగ్ అధికారులు చెబుతున్నారు. పునాదులు వెయ్యనివి 201, తీసినవి 312, బేస్‌మట్టం వేసినవి 326, గోడల దశలో ఉన్నవి 129, మోల్డింగ్ వేసినవి 123 ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. కనీసం ఐదేళ్లు అవుతున్నా 50 శాతం గృహాలు కూడా పూర్తి చేయకపోవడం విశేషం.




నారాయణరెడ్డిపల్లె వద్ద అసంపూర్తిగా ఉన్న జగనన్న ఇళ్లు, నేటికీ పునాది దశలోనే ఉన్న ఇళ్లు



దుద్యాల వడ్లపల్లి కొత్తచెరువు సమీపంలో వేసిన జగనన్న లేఅవుట్

ఇంటి సామగ్రి ధరలు పెరిగిపోయాయి



ఇళ్లు నిర్మించుకోవాలంటే అన్ని ధరలు పెరిగిపోయాయి. ట్రాక్టర్ ఇసుక రూ.5 వేలు అయ్యిందన్నారు. కడ్డీలు, సిమెంటు, ఇటుకలు ఇలా ధరలు పెరిగిపోయాయి. కూలీల ధరలు పెంచేశారు. ఒక బేల్దారికి రోజుకు వెయ్యి రూపాయలు ఇవ్వాల్సి వస్తుంది. ఇల్లు కట్టాలంటే భయమేస్తుంది.

-అనగాని రమణయ్య, ముదినేనివాండ్లపల్లె, సంబేపల్లె

లబ్ధిదారులు ముందుకు రావడం లేదు

మండలంలో జగనన్న గృహ నిర్మాణాల కోసం లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. గృహాలు నిర్మించుకునే వారికి బిల్లులు మాత్రం వెంటనే చెల్లిస్తున్నాం.

-శివ, మండల హౌసింగ్ అధికారి

బీచ్ కబడ్డీ ఎంపికలకు అనూహ్య స్పందన



బీచ్ కబడ్డీ క్రీడ ఆడుతున్న క్రీడాకారిణులు

కడప (స్పోర్ట్స్), జూలై 19 : జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక యోగి వేమన యూనివర్శిటీ మైదానంలో నిర్వహించిన 11వ బీచ్ కబడ్డీ ఎంపికలకు అనూహ్య స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుంచి వంద మందికి పైగా బాల, బాలికలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన క్రీడాకారుల పరిచయ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైవీయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి, మాజీ స్టెప్ సీఈఓ డాక్టర్ ఎం.రామచంద్రారెడ్డి హాజరై మాట్లాడారు. ఏదేని క్రీడలో గెలుపోటములు సహజమని, అంతమాత్రాన కృంగిపోకుండా అపజయాన్ని.. విజయంగా మలచుకునేందుకు మరింత శ్రమించాలన్నారు. బీచ్ కబడ్డీ క్రీడ చాలా శ్రమతో కూడుకున్నదని, అందుకు మానసికంగా సంసిద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు. తదనంతరం హాజరైన బాల, బాలికలకు ఎంపిక ప్రక్రియ చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఓ.రవీంద్రారెడ్డి, వర్కింగ్ సెక్రటరీ టి.శ్రీవాణి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ అరుణకుమారి, డీఎస్‌ఏ కబడ్డీ కోచ్ ఆర్.శ్రీధర్, ఆర్గనైజర్ అరుణ, పీడీ వెంకటసుబ్బన్న, తదితరులు పాల్గొన్నారు. అనంతరం బీచ్ కబడ్డీ నిర్వాహకులు కె.రామసుబ్బారెడ్డిని సత్కరించారు.

బీజేపీ తీర్థం పుచ్చుకున్న బీరం



పురందేశ్వరి సమక్షంలో బీజేపీలో చేరిన బీరం సుబ్బారెడ్డి

కడప (మారుతీనగర్), జూలై 19: కడపకు చెందిన బీరం విద్యాసంస్థల చైర్మన్ బీరం సుబ్బారెడ్డి భారతీయ జనతాపార్టీలోకి రాజకీయ అరంగేట్రం చేశారు. కడప జిల్లాలో ప్రముఖ విద్యాసంస్థల అధినేతగా బీరం సుబ్బారెడ్డి క్రియాశీలకంగా రాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో దేశ ప్రధాని నరేంద్రమోదీ గత పది సంవత్సరాలుగా దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న దృష్ట్యా బీజేపీ పట్ల ఆకర్శితులై పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఆ మేరకు జిల్లాకు చెందిన బీజేపీ నేతలు కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు కమిటీ రాష్ట్ర కన్వీనర్ సింగారెడ్డి శ్రీరామచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి ద్వారా శుక్రవారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం లో పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ బీరం సుబ్బారెడ్డి పార్టీలో చేరడంతో జిల్లాలో పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. అనంతరం బీరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించానని, ఇక నుంచి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పేదల పురోగతికి శ్రమిస్తానన్నారు.

అడవి పందుల దాడి... అరటిపంట ధ్వంసం



అడవిపందుల దాడి చేసి ధ్వంసం చేసిన అరటిమొక్కలు

వేంపల్లె, జూలై 19: వేంపల్లె పట్టణ సమీపంలో అడవిపందులు అరటిపంటపై స్వైర విహారం చేశాయి. సుమారు నాలుగు ఎకరాల్లో మూడు నెలల క్రితం నాటిన ఆరు వేల అరటిమొక్కలను పందులు మూకుమ్మడిగా నేలకూల్చాయి. కుప్పాలపల్లె గ్రామానికి చెందిన రైతు కె.రామగంగిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డిలు వేంపల్లె పట్టణం బైపాస్ రోడ్డు సమీపంలో పాములూరు గుట్టల కిందివైపు పది ఎకరాల్లో అరటిపంట సాగుచేశారు. గురువారం రాత్రి అడవిపందులు దాడి చేసి నాశనం చేశాయి. ఎకరాకు రూ.1.50 లక్షల దాకా ఖర్చు అయ్యిందని.. కంటికి రెప్పలా కాపాడి పెంచుకున్న అరటిమొక్కలను పందులు నాశనం చేశాయని రైతు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని ఫారెస్టు అధికారులకు ఫిర్యాదు చేశారు.

యువకుడి దారుణహత్య



హత్యకు గురైన వెంకటేశ్

కడప క్రైమ్, జూలై 19: కడప నగర బిల్టప్ సర్కిల్ సమీపంలో శుక్రవారం రాత్రి చింపిరి వెంకటేశ్ (32) అనే యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. విషయం తెలుసుకున్న తాలుకా సీఐ తిమ్మయ్య సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పరిశీలించారు. సీఐ వివరాల మేరకు... అంబభవానీ నగర్‌కు చెందిన వెంకటేశ్ జులాయిగా తిరుగుతుండేవాడు. రవీంద్రనగర్‌కు చెందిన సాధక్ వలిలు రాత్రి మద్యం సేవించేందుకు బిల్టప్ సర్కిల్‌కు వెళ్లారు. మద్యం సేవించిన ఇరువురి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. దీంతో సాధిక్‌వలి బీరు బాటిల్‌తో వెంకటేశ్ మెడపై పొడవడంతో అక్కడికక్కడే చనిపోయాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి.. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నామని తెలిపారు. హత్య జరిగినప్పుడు వీరు ఇరువురే ఉన్నారా.. వీరితో పాటు ఎవరెవరు ఉన్నారనేది పోలీసుల విచారణలో తెలియాల్సి ఉందన్నారు. కాగా, మృతుడు వెంకటేష్‌పై తాలూకా పోలీసు స్టేషన్‌లో రౌడీషీట్ ఉన్నట్లు సీఐ తెలిపారు.

9 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



నిందితుడితో ఫారెస్టు అధికారులు

కడప క్రైమ్, జూలై 19: కడప అటవీ డివిజన్ పరిధిలోని నాగసానిపల్లె బీట్ సమీపంలో ఎర్రచందనం దుంగలు రవాణా చేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఫారెస్టు ఫ్లయింగ్ స్క్వాడ్ గురుప్రసాద్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. ఎర్రచందనం దుంగలను కొంత మంది అడవి నుంచి డంపింగ్ చేసేందుకు తీసుకొస్తుండగా సిబ్బందిని చూసి స్మగ్లర్లు పరారయ్యారని.. నాగసానిపల్లెకు చెందిన ఈట్ల రామకృష్ణాను అరెస్టు చేసి.. తొమ్మిది దంగలు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పరారైన స్మగ్లర్ల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

అదుపు తప్పి ఆటో బోల్తా..ఒకరు మృతి

మైదుకూరు రూరల్ జూలై 19: దువ్వూరు మండలం కానగూడురు వద్ద ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో సారుకోళ్ల వీరయ్య అలియాస్ ఆపయ్య(55) అక్కడికక్కడే మృతి చెందగా.. మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల వివరాల మేరకు...

చాపాడు మండలం నెర్రవాడకు చెందిన రైతులు వరి విత్తనాల కొనుగోలుకు నంద్యాలకు వెళ్లి రేటు కుదరకపోవడంతో తిరిగి వస్తున్నారు. ఆటో కానగూడురు వద్దకు రాగానే అదుపు తప్పి బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న సారుకోళ్ల వీరయ్య మృతి చెందాడు. మరో నలుగురు గాయపడటంతో ఆళ్లగడ్డలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

ప్రేమించి మోసం చేసిన వ్యక్తికి రిమాండ్

చాపాడు, జూలై 19: ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన షేక్ మహమ్మద్ అనే వ్యక్తికి కోర్టు రిమాండ్ విధించింది. ప్రొద్దుటూరు పట్టణం శ్రీనివాస్‌నగర్ వాసి షేక్ మహమ్మద్.. చాపాడు మండలంలోని అనంతపురం దళితవాడకు చెందిన సోనా అనే యువతి సీబీఐటీ కళాశాలలో చదువుతుండగా ప్రేమించుకున్నారు. సోనా తనను పెళ్లి చేసుకోవాలని మహమ్మద్‌పై ఒత్తిడి తేవడంతో.. నీవు ఎస్సీ అని తన తల్లిదండ్రులు ఒప్పుకోవడం లేదని నిరాకరించాడు. ఈ మేరకు బాధితురాలు సోనా పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం మహమ్మద్‌ను అరెస్టు చేసి.. మైదుకూరు కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

జీతాల పెంపులో నాన్‌పీహెచ్ వర్కర్లకు అన్యాయం

- ప్రగతిశీల కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి

ప్రొద్దుటూరు, జూలై 19: మున్సిపల్ కార్మికుల సమ్మెలో కొన్ని కార్మిక సంఘాలు అవకాశవాద వైఖరి కారణంగా మున్సిపాలిటీల్లో నాన్‌పీహెచ్ కింద పనిచేసే కార్మికులకు వేతనాల పెంపులో అన్యాయం జరిగిందని ప్రగతిశీల కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి విమర్శించారు. శుక్రవారం ఎన్‌జీఓ హోంలో ప్రగతిశీల కార్మిక సంఘం అనుబంధంగా చైతన్య మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆవిర్భావ సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 55వేల మంది కార్మికులున్న మున్సిపాలిటీలో కార్మిక సంఘాలు సంఘటిత శక్తిగా వున్నప్పుడే మున్సిపల్ రంగంలో కార్మికుల సమస్యలన్నీ పరిష్కారమౌతాయన్నారు. పనికి సమాన వేతనం అమలు కావాలంటే కార్మిక సంఘాలు కార్మికుల హక్కులకు భరోసా శక్తిగా పనిచేయాలన్నారు. లేబర్ కోడ్ బిల్లులపై ఐక్యంగా పోరా డాల్సిన ఆవశ్యకత వుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వున్న మున్సి పల్ సమస్యలు, లోకల్‌గా మున్సిపాలిటీల్లో కార్మికుల సమ స్యలపై చైతన్య మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్మికులకు వెన్నుదన్నుగా పనిచేస్తుందన్నారు. సమావేశానికి పీకేఎస్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర అధ్యక్షత వహించగా చైతన్య వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులరెడ్డి, గౌరవ సలహాదారుడు మురళీ ప్రసాద్, రచయిత ఎస్పీ మహమూద్ ప్రసంగించారు. ఈసందర్భంగా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడుగా అరుణ్, ప్రధాన కార్యదర్శిగా ప్రశాంత్‌ను ఎన్నుకున్నారు.

కళలను ఆదరించాలి : కలెక్టర్



సర్టిఫికెట్లను అందజేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 19: కళలను ఆదరించాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ పేర్కొన్నారు. సావిత్రి భాయి పూలే కోలాట బృందం ఇటీవల ద్వారకా తిరుమలలో 122 మంది మహిళలతో దశావతారాలు జానపద కోలాట నృత్యం ప్రదర్శించారు. ఈ ప్రదర్శనకు ఇటర్నేషనల్ వండర్‌బుక్ ఆఫ్ రికార్డు లభించింది. ఈ సందర్భంగా శుక్రవారం సాయంత్రం గోల్డెన్ పార్కులో కోలాట బృంద సభ్యులకు అభినందన సభ నిర్వహించారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ నేటిడిజిటల్ యుగంలో ప్రాచీన కళలు ఆదరణ కోల్పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కోలాటం ఆంధ్రప్రదేశ్‌కు చెందినప్రముఖ కళ అని, నేటి యువత ఆ కళపై ఆసక్తితో నేర్చుకుని ప్రదర్శనలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కోలాటాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి కోలాటానికి పూర్వవైభవం తీసుకురావాలని కోరారు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మాట్లాడుతూ కోలాటం, చెక్కభజన పూర్వం నుంచి ఉన్న కళలు అని, అయితే సినిమాల రాకతో అవి మరుగునపడ్డాయన్నారు. మహిళలు ఉత్సాహంతో కోలాటం నేర్చుకోవడం హర్షణీయమన్నారు. కోలాటం నృత్యాన్ని ప్రదర్శించి అవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు. కోలాటంను బృందం సభ్యులు భవిష్యత్తు తరాల వారికి నేర్పించి ఆదర్శంగా నిలువాలని కోరారు. అనంతరం బృందం సభ్యులు ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఇంటర్నేషల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్లను కలెక్టర్, ఎమ్మెల్యేలు బృందం సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాసులు, డీఎస్పీ మురళీధర్, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, తహసీల్దారు విద్యాసాగర్‌రెడ్డి, టీడీపీ నాయకులు పల్లా రాజగోపాల్‌యాదవ్, రామక్రిష్ణబాబు, కోలాటం బృందం నాయకురాలు బండి మల్లిక, సినీ నటుడు బాబు, డ్యాన్స్‌మాస్టర్ ఖాజామొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఆదేశాలతో... మాన్యం భూములకు మోక్షం

రాయచోటిటౌన్, జూలై 19: రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశాలతో అన్యాక్రాంతమైన దేవాదాయశాఖకు చెందిన 42 ఎకరాల మాన్యం భూములకు మోక్షం వచ్చింది. సంబేపల్లె మండలం దేవపట్ల రెవెన్యూ గ్రామంలో ఎన్నో ఏళ్లుగా వైసీపీ నాయకుల ఆధీనంలో ఉన్న ఆవుల మాన్యం భూములను ఎట్టకేలకు రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకుని సర్వేనెంబర్ 330లో 37.06 ఎకరాలు, సర్వే నెంబర్ 506లో 4.28 ఎకరాలు, సర్వే నెంబర్ 570లో 0.5 ఎకరాల మాన్యం భూములకు సరిహద్దులు నిర్ణయించి శుక్రవారం దేవాదాయశాఖ అధికారులకు స్వాధీనపరిచారు. ఇదే మండలంలో వైసీపీ నాయకుల ఆధీనంలో ఉన్న మరికొన్ని ప్రభుత్వ భూములను గుర్తించి స్వాధీనపర్చుకునేందుకు రెవెన్యూ అధికారుల బృందం విచారణ చేపట్టింది. త్వరలోనే మరిన్ని భూములు ప్రభుత్వానికి స్వాధీనం కానున్నాయి.

ప్రతి ఇంటికి నీరు చేరేలా చూడాలి : కలెక్టర్

రాయచోటి టౌన్, జూలై19: ప్రతి ఇంటికి నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ గ్రామీణ నీటి సరఫరాశాఖ ఎస్ఈని ఆదేశించారు. శుక్రవారం రాయచోటి మండలం ఏపిలవంకపల్లి, గొరముదివేడు గ్రామంలో ప్రతి ఇంటికి నీరు చేరేలా చూడాలని గ్రామీణ నీటి సరఫరాశాఖ ఎస్ఈ ప్రసన్న కుమార్‌ను ఆదేశించారు.

ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీటి ట్రాక్టర్ ఎక్కడ వరకు వెళ్తే అక్కడ వరకు వెళ్లి నీటిని వదిలేలా చూడాలని ఈవోపీఆర్‌డీకి తెలిపారు. త్వరలో కాలువలు మంజూరయ్యేలా చూస్తానని గ్రామస్తులకు తెలిపారు. కార్యక్రమంలో గ్రామీణ నీటి సరఫరాశాఖ ఎస్ఈ ప్రసన్నకుమార్, ఈవోపీఆర్‌డీ, ఎంపీడీవో, వీఆర్వో తదితరులు పాల్గొన్నారు.

సర్వజన ఆసుపత్రికి రేడియోగ్రాఫర్ కరువు

- ఎక్స్‌రే కోసం రోగుల అవస్థలు... ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు



పులివెందులలోని డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి

పులివెందుల రూరల్, జూలై 19: పులివెందులలో నూతనంగా నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి రేడియోగ్రాఫర్ కరువయ్యారు. 20 రోజుల నుంచి రేడియోగ్రాఫర్ లేకపోవడంతో ఎక్స్‌రే కోసం రోగులు ప్రైవేటు కేంద్రాలను ఆశ్రయిస్తూ వందల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. వివరాలు ఇలా... పులివెందులలో మెడికల్ కళాశాలకు అనుబంధంగా డాక్టర్ వైఎస్సార్ సర్వజన ఆసుపత్రి నిర్మించారు. ఇందులో ఔట్ పేషంట్, ఇన్ పేషంట్, ఎమెర్జెన్సీ వార్డులు నిర్మించి 420 పడకలు ఏర్పాటుచేశారు. ప్రతి రోజు దాదాపు 700 నుంచి 900 దాకా రోగులు వస్తున్నారు. ఇంత మంది ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్సకు వస్తున్నా రేడియో గ్రాఫర్ లేకపోవడం దారుణం. గత నెల 30వ తేదీ ఇక్కడ పనిచేస్తున్న రేడియోగ్రాఫర్ రిటైర్ అయ్యారు. అప్పటి నుంచి ఎక్స్‌రే గది మూతపడింది. సాధారణ దగ్గుతో పాటు క్షయ వ్యాధి సోకిన వారికి, పలు ఊపిరితిత్తుల సమస్య ఉన్న వారికి ఎక్స్‌రే తీయించుకోవాల్సిందే. అంతేకాకుండా ప్రమాదాలు జరిగినపుడు ఎముకలు బెనకడం లేదా విరగడం జరుగుతుంటాయి. వీటిలో ఏమి తెలుసుకోవాలన్నా ఎక్స్‌రేలో బయటపడుతుంది. శస్త్రచికిత్సలకు కూడా ఎక్స్‌రే అతిముఖ్యమైనది. వీటితో పాటు సదరం క్యాంప్‌లు జరిగినపుడు ఎముకల విభాగం వైద్యులు తప్పనిసరిగా ఎక్స్‌రే తీపిస్తుంటారు. ఆసుపత్రిలో ఎక్స్‌రే విభా గం అధిక పాత్ర పోషిస్తుంటుంది. కానీ పులివెందుల ఆసుపత్రిలో మాత్రం ఎక్స్‌రే యంత్రా లు ఉన్నప్పటికి రేడియోగ్రాఫర్ లేరు. దీంతో చికిత్సకు దూరప్రాంతాల నుంచి వచ్చేరోగులు తీవ్ర అవస్థలుపడుతున్నారు. కొందరు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్తున్నారు. మరికొందరు ప్రైవేటు ఎక్స్‌రే కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వెంటనే రేడియోగ్రాఫర్‌ని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.




తాళం వేసిన ఎక్స్‌రే గది

ఉన్నతాధికారులకు తెలియజేశాం

రేడియోగ్రాఫర్ లేకపోవడంతో ఇబ్బంది ఉన్న మాట వాస్తవమే. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం. పరిస్థితిని వివరించాం. త్వరలో రేడియోగ్రాఫర్ నియామకం జరుగుతుంది.

-డాక్టర్ మల్లీశ్వరి, సూపరింటెండెంట్,
ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, పులివెందుల.



ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



పత్తి పంటను పరిశీలిస్తున్న నాగేశ్వరరావు

పెండ్లిమర్రి, జూలై 19: ప్రకృతి వ్యవసాయం ప్రయోజనకరమని జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు సూచించారు. శుక్రవారం మండలంలోని చెన్నమరాజుపల్లెలో ఆయన పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా పేనుబంక, పచ్చదోమ నివారణకు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో నీమాస్త్రంను పిచికారీ చేయించారు. దోమ నివారణకు పసుపు, తెలుపు పళ్లాలు, పక్షి స్థావరాలను, అదేవిధంగా ఎరపంటగా ఆముదం సాగు చేస్తే ఖర్చులు తగ్గి దిగుబడి పెరుగుతుందన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ కషాయాలు, దేశీ ఆవును పరిశీలించారు. కొత్తగిరియంపల్లెలో నాగరత్నమ్మ సూర్యమండలం పద్ధతిలో వేసిన 22రకాల ఆకుకూరలు, కూరగాయాలను పరిశీలించారు. అంగన్వాడీ పిల్లలకు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారి రామకృష్ణమరాజు, మండల వ్యవసాయాధికారి జీపీ ఓబులేసు, సిబ్బంది పాల్గొన్నారు.

కేసీ కెనాల్‌లో వ్యర్థాల తొలగింపు



వ్యర్థాలను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

చెన్నూరు, జూలై 19:కేసీ కెనాల్‌లో పేరుకుపోయిన పలు రకాల వ్యర్థాలను శుక్రవారం సాయంత్రం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో తొలగించారు. నెలరోజుల కిందట ఈదురు గాలులకు కేసీ కెనాల్ పక్కనే ఉన్న ఓ తుమ్మ చెట్టు విరిగి కాలువలో అడ్డంగా పడటంతో వ్యర్థాలను తొలగించే అవకాశం లేదు. దీంతో ఎగువ భాగం నుంచి కొట్టుకొచ్చిన పలురకాల వ్యర్థాలు అక్కడే నిలిచిపోయాయి. ఇవి కుప్పలు కుప్పలుగా పెరిగి కంపు కొట్టడంతో స్థానిక పంచాయతీకి సమాచారం ఇచ్చారు.దీంతో పంచాయతీ సిబ్బంది వాటిని తొలగించారు.

జర్నలిజం పరీక్ష తనిఖీ



పరీక్షలను తనిఖీ చేస్తున్న రిజిస్ట్రార్ రఘునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్, జూలై 19: వైవీయూ జర్నలిజం అనుబంధ కోర్సులైన పీజీ డిప్లమో ఇన్ పబ్లిక్ రిలేషన్, డీజీ డిప్లమో ఇన్ తెలుగు జర్నలిజం సెమిస్టర్ పరీక్షలను రిజిస్ట్రార్ ఎస్.రఘునాథరెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాల్‌టికెట్‌లు నామినల్ రోల్‌ను పరిశీలించారు. జర్నలిజం శాఖ అధిపతి శ్యామ్‌స్వరూప్ పర్యవేక్షణలో ఈ పరీక్షలు జరుగుతున్నాయి.

సమస్యలు పరిష్కరించండి: యూటీఎఫ్



వినతిపత్రం అందిస్తున్న యూటీఎఫ్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, జూలై 19: జిల్లాలో ఉద్యోగ, ఉపాధ్యాయుల ఏపీజీఎల్ఐకి సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాళెం మహేశ్‌బాబు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏపీజీఎల్ఐ కార్యాలయంలో సహాయ సంచాలకులు రమేష్‌బాబును కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను ఆయనకు వివరించారు. యూటీఎఫ్ నాయకులు నరసింహరావు, ఎజాస్ అహమ్మద్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

గోపులాపురం గోడు ఎవరికీ పట్టదా..?

● మూడు రోజులుగా తాగు నీరు బంద్.. ● పనులు వదులుకుని పొలాల వద్దకు గ్రామస్థుల పరుగులు



గోపులాపురం సమీపంలోని పొలాల్లో నీరు తెచ్చుకుంటున్న గ్రామ ప్రజలు

కమలాపురం రూరల్, జూలై 19: అన్నింటికీ నీరే ఆధారం.. ఆ నీరు ఒక్క రోజు అందకపోయినా ఎంత ఇబ్బంది ఉంటుందో మనందరికీ తెలియంది కాదు..అలాంటిది ఏకంగా మూడు రోజుల నుంచి ఆ గ్రామానికి తాగునీరు కరువైంది. ఇక ఆ గ్రామ ప్రజలు పనీపాట వదులుకుని పంట పొలాల చెంతకు పరుగులు తీస్తున్నారు. మండల పరిధిలోని సి గోపులాపురం గ్రామంలో గత మూడు రోజులుగా తాగునీరు రాక గ్రామ ప్రజలు అవస్థలు పడుతున్నారు. గత మూడు రోజుల నుంచి గ్రామంలో పైపులైన్‌కు తాగునీరు సరఫరా కావడం లేదు. ఆ గ్రామానికి సమీపంలోనే యర్రగుంట్లకు తాగునీటి కోసం ఏర్పాటు చేసిన పైపులైన్ పోతోంది. అయినప్పటికీ తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని గ్రామస్థులు పేర్కొన్నారు. అన్నింటికీ నీరు ప్రధానం అని, ఆ నీరు రాకపోతే మా పరిస్థితి ఏమిటని, అధికారులు స్పందించి మా గ్రామానికి నీరు వచ్చే విధంగా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు. గ్రామంలో ఎక్కువగా పశుపోషణపై రైతులు ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, మాకే తాగునీరు లేకపోతే పశువులకు ఎలా తెచ్చుకోవాలని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంతగా నీటి కష్టాలు ఉన్నా ఏ ఒక్కరు మా గ్రామం వైపు తొంగి చూడలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంట పొలాల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకోవాలంటే చాలా కష్టంగా ఉందన్నారు. గత మూడు రోజులుగా ఇబ్బంది పడుతున్నామని, ఇలా ప్రతి రోజు మోటార్ల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకోవాలంటే చాలా కష్టంగా ఉందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించిన తమ సమస్య పరిష్కరించే విధంగా చూడాలని ఆ గ్రామస్థులు కోరారు.

పైప్‌లైన్ లీకేజీ.. వృథాగా పోతున్ననీరు



కొండప్పగారిపల్లె రోడ్డు పక్కన పైప్‌లైన్ లీకై వృథా అవుతున్న నీరు

చక్రాయపేట, జూలై 19: మండలంలోని రాజుపల్లె వద్ద నిర్మించిన మంచినీటి పథకం పైప్‌లైన్ లీకేజీ కారణంగా నీరు వృథాగా పోతోంది. దీంతో ఎగువ ప్రాంతాల్లోని గ్రామాలకు నీరు సక్రమంగా అందడం లేదని గ్రామస్థులు అంటున్నారు. చిలేకాంపల్లె, గడ్డంవారిపల్లెల్లో ట్యాంకులకు నీరు ఎక్కడం లేదని, దీంతో తాగునీటికి ఇబ్బందిపడుతున్నామని వారు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

నేడు సమన్వయ కమిటీ సమావేశం

చక్రాయపేట, జూలై 19 : గండి క్షేత్రంలో ఆగస్టు 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్న శ్రావణమాస మహోత్సవాలపై సమన్వయ కమటీ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. స్థానిక గండి క్షేత్రంలోని కార్యాలయంలో జరిగే ఈ సమావేశానికి పులివెందుల ఆర్డీఓ వెంకటేశులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని ఈ సందర్భంగా కోరారు.

కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

● కడప ఎమ్మెల్యేకు సీఆర్ఎంటీల వినతి



ఎమ్మెల్యే మాధవికి వినతిపత్రం అందిస్తున్న సీఆర్ఎంటీలు

కడప ఎడ్యుకేషన్, జూలై 19: సమగ్ర శిక్ష అభియాన్‌లో గత 12 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఆర్ఎంటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. శుక్రవారం కడప నగరం ద్వారకానగర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే మాధవిని కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని చెప్పి మాట తప్పిందన్నారు. తమ ప్రభుత్వంలోనైనా న్యాయం చేయాలని కోరారు. ఎమ్మెస్సీ బీఈడీ, టెట్ పూర్తి చేసిన వారికి డీఎస్సీ, రోస్టర్ మెరిట్ ఇంటర్వ్యూ ద్వారా ఎంపిక చేశారన్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సీఆర్ఎంటీలు కృష్ణ, శంకర్, వెంకటాద్రి, రఘుపతి, రామచంద్ర, నాగమణి, కుమారి, సుభాషిని, జమిల్లునిసా, మంగమ్మ, సువర్ణ, రాజేశ్వరి, పాల్గొన్నారు.

బస్టాండ్ వద్ద కాల్వ పనులు ప్రారంభం



వేంపల్లె బస్టాండ్ వద్ద కాల్వపై పనులు చేస్తున్న దృశ్యం

వేంపల్లె, జూలై 19: వేంపల్లె ఆర్టీసీ బస్టాండ్ దాదాపు పూర్తయింది. నిర్మాణంలో ఉండడంతో ఆర్టీసీ బస్సులు లోపలికి వెళ్లలేక రోడ్డుపైనే నిలబెట్టేస్తున్నారు. దీంతో ట్రాఫిక్ అంతరాయం కలుగుతోంది. వేంపల్లెలో సిమెంటు రోడ్డు, కాల్వ నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ ప్రభుత్వం మారడంతో పనులను అర్థంతరంగా నిలిపివేశాడు. కాల్వమీద కల్వర్టు నిర్మించకపోవడంతో బస్సులు లోపలికి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి రవాణా శాఖా మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కలిసి కల్వర్టు పనులు చేయించాలని కోరారు. మంత్రి ఆదేశాలతో ఆర్టీసీ, ఆర్‌అండ్‌బీ అధికారులు చర్చించి శుక్రవారం బస్టాండ్ వద్ద కల్వర్టు నిర్మాణ పనులను ప్రారంభించారు. కల్వర్టు పూర్తయితే బస్సులు బస్టాండ్‌లోకి వెళ్లే మార్గం సుగమం అవుతుంది.

దోమతెరలు తప్పక వాడాలి

● డీఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ నాగరాజు



ర్యాలీలో పాల్గొన్న డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ నాగరాజు

కడప(కలెక్టరేట్), జూలై 19: వానాకాలంలో దోమల ఉత్పత్తి అధికంగా ఉంటుందని, దోమకాటుకు గురైతే మలేరియా, డెంగ్యూ లాంటి విష జ్వరాల బారిన పడే అవకాశాలెక్కువుగా ఉన్నందున ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు సూచించారు. శుక్రవారం కార్పొరేషన్ పరిధిలోని ఇందిరానగర్‌లో డ్రైడే- ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించి ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్ హెచ్ఓ మాట్లాడుతూ వారానికి ఒక సారి ఇంట్లోని కుండలు, పాత్రలు, కూలర్లు,తొట్లు శుభ్రం చేసుకుని ఎండబెట్టాలన్నారు. ఈ సీజన్లో తాగునీరు కాచి చల్లార్చి తాగాలన్నారు. స్పర్శ లేని పొడ మచ్చలు ఉన్నవారు ఏఎన్ఎంలకు తెలిపితే మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. మురికి కాలువలను పరిశుభ్రంగా ఉండేలా కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అధికారి పెన్నాసాగర్, ఏఎంఓ వెంకటరెడ్డి, మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగలక్ష్మీ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు తదితరులు పాల్గొన్నారు.

మహిళ మృతికి డయేరియా కారణం కాదు

చాపాడు మండలం అల్లాడుపల్లి బీసీ కాలనీకి చెందిన 72 ఏళ్ల మహిళ సాధారణ ఆరోగ్య సమస్యతో మృతిచెందిందే తప్ప డయేరియాతో కాదని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అల్లాడుపల్లికి చెందిన బాలవీరమ్మ రెండు రోజుల కిత్రం చాపాడు ప్రాథమిక ఆసుపత్రిలో వైద్యం తీసుకొని అదేరోజు ఇంటికెళ్లిందన్నారు. గతంలో ఈ మహిళ బైపాస్ సర్జరీ చేయించుకుందని, హైపర్ టెన్షన్, దయాబెటీస్ సమస్యతో బాధపడేదన్నారు సకాలంలో సరైన మందులు వాడని కారణంగానే మృతి చెందిందన్నారు. ఈ ఘటనపై వైద్య శాఖాధికారులు విచారించి మృతికి గల కారణాలను నిర్ధారించారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా రమణారెడ్డి



రమణారెడ్డి



రాజు

కడప (మారుతీనగర్), జూలై 19: కడప జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడిగా కొండా రమణారెడ్డి (టీవీ- 5 స్టాఫ్ రిపోర్టర్), అలాగే కార్యదర్శిగా 99 టీవీ రాజు ఎన్నికయ్యారు. శుక్రవారం కడప ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి రామసుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వీరిని ఎన్నుకున్నారు. కాగా అధ్యక్ష పదవి కోసం సీపీ రమేష్, రమణారెడ్డి పోటీపడగా రమణారెడ్డి నాలుగు ఓట్ల మెజార్టీతో రమేష్‌పై గెలుపొందారు. అలాగే శ్రీనివాస్‌పై రాజు ఒక్క ఓటు ఆధిక్యతతో విజయం సాధించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తామన్నారు. కాగా మిగతా కార్యవర్గాన్ని త్వరలో ఎన్నుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర నాయకుడు శ్రీనివాసులు, ప్రెస్‌క్లబ్ కన్వీనర్ లక్ష్మీనాథ్‌రెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

'యాదవ భవన్‌ను నిర్మించండి'

కడప (మారుతీనగర్), జూలై 19: యాదవ భవన్‌ను నిర్మించాలని కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డిని శుక్రవారం స్థానిక ద్వారకానగర్‌లోని ఆమె నివాసంలో రాయలసీమ యాదవ కమ్యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణయాదవ్, అసోసియేషన్ నాయకులు కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాదవుల చిరకాల వాంఛ అయిన యాదవ భవన్‌ను కడప నగరంలో నిర్మించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పాములేటి యాదవ్, నా యకులు శేఖర్‌యాదవ్, బాబు యాదవ్, రామమూర్తి యాదవ్, సుబ్బరాయుడు, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

లంపిస్కిన్, గొంతువాపు వ్యాధికి టీకాలు



పశువులకు టీకా వేస్తున్న వైద్యులు

పెండ్లిమర్రి, జూలై 19: మండలంలోని కోనాయపల్లె, ఏరాసుపల్లె గ్రామాలలోని పశువులకు లంపిస్కిన్ వ్యాధి, గొంతువాపు వ్యాధి నివారణకు టీకాలు వేసినట్లు జిల్లా ఉప సంచాలకులు డాక్టర్ రమణయ్య తెలిపారు. శుక్రవారం ఆయా గ్రామాల్లో పశువులలో ప్రత్యుత్పత్తి సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గర్భకోశవ్యాధులకు వైద్యం అందించారు. డాక్టర్ రమేష్, సహాయ సంచలకులు డాక్టర్ శ్రీధర్ లింగారెడ్డి, పెండ్లిమర్రి డాక్టర్ సురేష్‌రెడ్డి, శివరామిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 3 గంటల పాటు విద్యుత్ నిలిపివేత

చెన్నూరు, జూలై 19: చెన్నూరు మండల వ్యాప్తంగా శనివారం ఉదయం 8.30 గంటల నుంచి 11.30 వరకు 3 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ రామలింగారెడ్డి తెలిపారు. 33 కేవీ లైన్‌లో తుప్పు పట్టిన టవర్లకు మరమ్మతులు, కొత్త టవర్ నిర్మాణం పని ఉండటం వల్ల సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

హెల్మెట్‌తో మనకూ.. మన కుటుంబానికీ రక్ష



చెన్నూరులో హెల్మెట్ ఉపయోగంపై అవగాహన ర్యాలీ

చెన్నూరు, జూలై 19: హెల్మెట్ ధరిస్తే మనతో పాటు మనకుటుంబానికి కూడా రక్ష అని, చెన్నూరు సీఐ నారాయణ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం ఎస్పీ ఆదేశాల మేరకు చెన్నూరులో డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ ధరించడం వల్ల జరిగే ప్రయోజనాలు, ధరించకపోతే ప్రమాదాల వల్ల కలిగే ఇబ్బందులను ఆయన వివరించారు. చెన్నూరు పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తూ హెల్మెట్ ప్రయోజనాలను వివరించారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వాహనాన్ని నడిపే సమయంలో హెల్మెట్ ధరించాలని, అది కూడా ఐఎస్ఐ మార్కు గల నాణ్యమైన హెల్మెట్ అయి ఉండాలన్నారు. ఇటీవల హైవే రహదారులపై ద్విచక్రవాహన ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఎందరో ప్రాణాలు పోగొట్టుకున్నారని గుర్తు చేశారు. అందుకోసం శరీరంలోని ప్రధాన భాగమైన తలకు అధిక ప్రాధాన్యతను ఇస్తూ హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. హెల్మెట్ ధరించడం వల్ల జీవితం పూలమీద నడకలా ఉంటుందని, ధరించకపోతే ముళ్ల మీద పడకేనన్నారు. ప్రభుత్వాలు హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను ఎంతో కాలంగా ప్రభుత్వాలు వివరిస్తున్నా ఇంకా నిర్లక్ష్యంగా ప్రాణాలు పో గొట్టుకుంటున్నారని, అలాంటి పరిస్థితికి స్వస్తి పలకాలంటే హెల్మెట్ ధరించడమే మేలని అందరూ గుర్తుంచుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్యారా లీగల్ వలంటీర్ దశరథరామిరెడ్డి, ఏఎస్ఐ అంజనేయులు, మహిళా పోలీసులు, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

కడప (మారుతీనగర్), జూలై 19: రక్తదానం ప్రాణదానంతో సమానమని, 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్, నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువ అధికారి మణికంఠ పేర్కొన్నారు. నెహ్రూ యువకేంద్రం, జిల్లాలోని వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ నుంచి 26 వరకు రక్తదాన వారోత్సవాలు జరగనున్న నేపథ్యంలో శుక్రవారం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ ప్రభావం వల్ల డెంగ్యూ, మలేరియా తదితర విషపూరిత జ్వరాలు ప్రబలుతున్నాయన్నారు.అస్వస్థతకు గురైన వారికి అవసరమైన రక్తం నిల్వలు తక్కువగా ఉన్నాయన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని యువకులు, ఉద్యోగులు, వ్యాపారులు, ఇతరులు రక్తదానం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సేవా ప్రతినిధులు అశోక్ పాల్గొన్నారు.

నీటి పరీక్షలు విధిగా చేయాలి: కమిషనర్



వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ రమణారెడ్డి

పులివెందుల టౌన్, జూలై 19: సురక్షిత మంచినీటి సరఫరాలో చేయడంలో నీటి పరీక్షలు విధిగా చేయాలని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి అధికారులను సూచించారు. శుక్రవారం ముద్దనూరురోడ్డులో ఉన్న వాటర్‌ట్రీట్‌మెంట్ ప్లాంట్ ను సందర్శించారు. మంచినీటి క్లోరినేషన్ చేసి ఇంటింటికి సరఫరా చేయాలన్నారు. అలాగే పూలంగళ్ల సమీపంలో జరుగుతున్న శానిటేషన్ పనులను పరిశీలించారు. శానిటరీ సెక్రటరీలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ స్టార్ డయేరియా కార్యక్రమంపై మాట్లాడుతూ దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి మాట్లాడారు. దోమల పెరుగుదలకు కారణమయ్యే విషయాలను ప్రజలకు వివరంచాలన్నారు. కలుషిత నీరు, ఆహారం వలన టైఫాయిడ్, డ యేరియా వంటి వ్యాధులు వస్తాయని ప్రజలు పరిశుభ్రత పాటించే విధంగా వారికి అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు.

రేపు గురుపౌర్ణమి వేడుకలు

కడప మారుతీనగర్, జూలై 19: కడప నగరం నబీకోటలోని షిరిడీ సాయిబాబా మందిరంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త కృష్ణమూర్తి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు హారతి, అనంతరం అన్న సంతర్పణం ఉంటుందని, ఈ వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ప్రజా ఆరోగ్యం కోసం మరుగుదొడ్ల వాడకం తప్పనిసరి



గుర్రంపాడులో మరుగుదొడ్ల ఆవశ్యకతను వివరిస్తున్న అధికారులు

చెన్నూరు, జూలై 19: మండలంలో మరుగుదొడ్లు నిర్మించుకున్న ప్రతి ఒక్కరూ ప్రజా ఆరోగ్యం కోసం వాటిని తప్పక ఉపయోగించుకోవాలని ఆరుబయట మలవిసర్జన చేస్తే అనారోగ్యం పాలు కాక తప్పదని వల్లూరు ఎంపీడీఓ విజయ్‌భాస్కర్ తెలిపారు. మండలంలోని ముండ్లపల్లి, రాచినాయపల్లెల్లో మరుగుదొడ్ల వాడకంపై వల్లూరు మండలం నుంచి వచ్చిన బృందం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులకు, గ్రామాల ప్రజలకు వారి ఇళ్లవద్దకే వెళ్లి అ వగాహన కల్పించారు. సగం వ్యాధులు మరుగుదొడ్లు వాడకపోవడం వల్లే వస్తున్నాయన్నారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి ఇంటింటికీ మరుగుదొడ్ల నిర్మాణం కోసం నిధులు అం దిస్తే వాటిని ఉపయోగించుకోకుండా నిరుపయోగంగా ఉంచడం మంచి పద్ధతి కాదన్నారు. కావున మరుగుదొడ్లను ఉపయోగించుకోవడంతో పాటు ఇంటి పరిసరాలు, వీధులు, ఆయా ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇష్టానుసారంగా ము రుగుకాల్వలలో కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ బాటిల్స్, పాలిథిన్‌కవర్లు, ఇళ్ల నుంచి వచ్చిన కసు వు, పనికిరాని వస్తువులు వేయడం వల్ల నీరు సరిగా వెళ్లక నిల్వచేరి దోమలు పెరిగి ప్రజలు వాటివల్ల రోగాల బారిన పడతారన్నారు. తద్వారా ఆసుపత్రుల చుట్టూ తిరగుతూ సమయం, డబ్బు, వృథా చేసుకుంటారన్నారు. డీఎల్‌డీఓ వెంకటసుబ్బయ్య, చెన్నూరు ఎంపీడీఓ సుబ్రమణ్యం శర్మ, ఆర్‌డబ్ల్యుఎస్ వినోద్‌కుమార్‌రెడ్డి, ఈఓ ఆర్‌డీ సురేష్ బాబు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడిని తీర్చండి

పులివెందుల టౌన్, జూలై 19: మున్సిపాలిటీలోని బాకరాపురం జయమ్మకాలనీలో నీటి ఎద్దడిని తీర్చాలని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు కోరారు. శుక్రవారం మున్సిపల్ కమీషనర్ రమణారెడ్డికి వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా తాగునీరురాక ఆ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పైప్‌లైన్ సమస్య తలెత్తితే వాటర్ ట్యాంకులతోనైనా నీళ్లు అందించాలని కోరారు. సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీనాయకులు మురళి, విష్ణు, వీరచంద్ర, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఆగమ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి

● అర్చక పురోహిత సంఘం అధ్యక్షుడు గోపాలకృష్ణశర్మ

కడప (కల్చరల్), జూలై 19: బ్రాహ్మణులను అర్చక స్వాములుగా తీర్చిదిద్ది తద్వారా వారికి హిందూ దేవాలయాలలో ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఆగమ పరీక్షలు నిర్వహించనున్నారని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని అర్చక పురోహిత సంఘం అధ్యక్షుడు పిడతల గోపాలకృష్ణ శర్మ పేర్కొన్నారు. ఈ మేరకు ఇటీవల సంబంధిత దేవదాయ శాఖ అడిషనల్ కమిషనర్, ఆగమ పరీక్షల కంట్రోలర్ కె.రామచంద్రమోహన్ పరీక్షల వివరాలను తెలియజేశారు. కావున ఈ అవకాశాన్ని జిల్లాలోని బ్రాహ్మణులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శుక్రవారం స్థానిక ఆకుల వీధిలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయ న మాట్లాడారు. ఇందులో ప్రధానంగా వైదిక, స్మార్త, పాంచరాత్ర, వైఖానస, తంత్రసార, వీరశైవ, చాత్తాద శ్రీ వైష్ణవ, అలాగే గ్రామ దేవత ఆగమంలో ప్రవేశ, వర, ప్రవరస్థాయిలకు పరీక్షలు చేపట్టనున్నారు. ఔత్సాహిక అభ్యర్థులు 16 సంవత్సరాలు నిండి విద్యార్థతగా కనీసం 5వ తరగతి ఉత్తీర్ణత లేదా తత్సమానమైన విద్యా పరిజ్ఞానం కలిగి ఉంటే సంబంధిత సంస్థ నుంచి లేదా గురువు నుంచి ధ్రువీకరణ పత్రం జతపరచాల్సి ఉంటుందన్నారు. కాగా 40 సంవత్సరాలు నిండిన అభ్యర్థులకు రాత పరీక్ష మినహా ఇస్తామన్నారు. అలాంటి వారు గెజిటెడ్ అధికారిచే ధ్రువీకరించబడిన పుట్టిన తేదీ సర్టిఫికెట్ జతచేయాల్సి ఉంటుందన్నారు. కాగా 40 సంవత్సరాల కంటే తక్కువ వయస్సున్న అభ్యర్థులకు పరీక్ష ఉంటుందన్నారు. వర, ప్రవర రాసే అభ్యర్థులు గెజిటెడ్ అధికారిచే ధ్రువీకరించబడిన ప్రవేశ, వర, పరీక్షల యోగ్యతాపత్రాలను దరఖాస్తుతో పా టు జతపరచాల్సి ఉంటుందన్నారు. పరీక్షలు రాసే అభ్యర్థులు తమ దరఖాస్తులను వచ్చే సెప్టెంబర్ 20వ తేదీ లోపు ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో సమర్పించాలన్నారు. పూర్తి వివరాలకు 08645- 273139, 9491000607, 9440682996 అనే నెంబర్లను సంప్రదించాలని కోరారు. ఈ సమావేశంలో బ్రాహ్మణ సాధికార సమితి పార్లమెంట్ కన్వీనర్ జనార్ధన్, నియోజకవర్గ కన్వీనర్ అజయ్‌శర్మ, అర్చకులు రఘువీర్, శివకృష్ణ, రాఘవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యాన్ని నింపే 'పోస్' : ఆర్డీఓ

జమ్మలమడుగు, జూలై 19: పోస్ యాక్టు 2013 చట్టం మహిళల్లో ధైర్యం, ఆత్మస్థైర్యాన్ని కలిగిస్తుందని ఆర్డీఓ శ్రీనివాస్, స్త్రీ శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారి డి.శ్రీలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం జమ్మలమడుగు ఆర్డీఓ కార్యాలయ సభాభవనంలో పోస్ 2013 చట్టంపై డివిజన్‌స్థాయిలో అధికారులకు మహిళాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ సాధికారిత అధికారి శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపుల నివారణ చట్టం పోస్ యాక్టు 2013ను పటిష్ఠపరచాలన్నారు. ప్రతి శాఖలో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులపట్ల జరిగే సూటిపోటి మాటలు లైంగికంగా వేధించే మాటలు సంబంధిత మహిళలు వెంటనే ఫిర్యాదు చేయాలని, అలాంటివారి పేర్లు గోప్యంగా ఉంచబడతాయన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి కమిటీ సమావేశం నిర్వహించాలని వార్షిక నివేదికను స్థానిక ఫిర్యాదులు కమిటీకి నివేదించాలన్నారు. మూడేళ్ల కాల పరిమితితో ఈ కమిటీ పనిచేస్తుందన్నారు. చిన్నపిల్లల రక్షణ కోసం 1098, మహిళల సమస్యల కోసం 181, 112 టోల్‌ఫ్రీ నంబర్లకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఆర్డీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ చట్టాన్ని ప్రతి ఒక్కరూ నిష్పక్షపాతంగా అమలుపరచాలని సూచించారు. గ్రామస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేయడం, ప్రజలకు అవగాహన ఇచ్చే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జమ్మలమడుగు ఇన్‌చార్జి డీఎస్పీ మురళీధర్ మాట్లాడుతూ ప్రతి సంస్థ, ప్రతి కార్యాలయాల్లో మహిళలు ఎదుర్కొనే వేధింపులను నివారించేందుకు ఈ చట్టం చాలా ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మహిళలు ధైర్యంగా ప్రతి సమస్యను ఎదుర్కోవాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ సుబ్రమణ్యం, మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, సీడీపీఓ రాజేశ్వరిదేవి, తహసీల్దారు కరుణాకర్, ఎంపీడీఓ ముజఫర్, విద్యాశాఖ, పంచాయతీరాజ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్

కరుణించిన శాకాంబరీ దేవి

మైదుకూరులో వాసవీమాత, ఎర్రగుంట్లలో ఏరువాక గంగమ్మ, బద్వేలులో దుర్గమ్మ


మైదుకూరులో అమ్మవారికి చీరలతో అలంకారం - ఎర్రగుంట్లలో ప్రత్యేక పూజలో ఏరువాకగంగమ్మ అమ్మవారు - బద్వేలులో దుర్గమ్మ అమ్మవారు

ఆషాఢ మాసం శుక్రవారం అమ్మవారిని శాకాంబరీదేవిగా అలంకరించారు. ఇందులో భాగంగా మైదుకూరులో వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి, ఎర్రగుంట్లలో ఏరువాకగంగమ్మ, జమ్మలమడుగులో లలితా దేవిని, బద్వేలులో దుర్గమ్మ అమ్మవారిని వివిధ రకాల ప్రత్యేక కూరగాయలతో చేపట్టిన అలంకారం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. వివరాల్లోకెళితే....

మైదుకూరు రూరల్ జూలై 19: అషాఢ మాసం శుక్రవారం అమ్మవారిశాలలో మూలవిరాట్టు అమ్మవారిని శాకాంబరీదేవి అలంకారంలో మహిళలు అలంకరిచారు. తెల్లవారుజాము నుంచే వేద పండితుల చేత అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహానికి చీరలతో అలంకారం చేశారు. ఆర్యవైశ్య సభ అధ్యక్షుడు సూరిశెట్టి ప్రసాద్, సురేంద్ర, ఆనంద్, కుమార్, ప్రసాద్ పాల్గొన్నారు.

శాకాంబరీదేవిగా ఏరువాక గంగమ్మ

ఎర్రగుంట్ల, జూలై 19: ఎర్రగుంట్ల ఏరువాక గంగమ్మ అమ్మవారిని శాకాంబరీదేవిగా అలంకరించారు. మహిళా భక్తులు అన్ని రకాల కూరగాయలను దండలుగా తయారు చేసి అమ్మవారికి అలంకరించారు. వందలాది మంది అమ్మవారిని దర్శించుకుని మొక్కులను తీర్చుకున్నారు. రాత్రి అమ్మవారికి అష్టోత్తరశతనామావళి కుంకుమార్చన, శ్రీచక్ర కుంకుమార్చన నిర్వహించారు. అనంతరం పల్లకీసేవ నిర్వహించారు.

లలితాదేవి అమ్మవారికి...

జమ్మలమడుగు, జూలై 19: మెయిన్ బజార్ శివార్లలో పెన్నానది సమీపాన వెలసిన జంబులింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ఆలయ కమిటీవారు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. లలితాదేవి అమ్మవారికి ఆషాఢమాసం వడిబియ్యం తీసుకొస్తూ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు పట్టణంలో వడిబియ్యం తీసుకుని ప్రదర్శనగా తీసుకెళ్లారు. అమ్మవారికి సమర్పించి పూజలు చేసి మొక్కుకున్నారు.

ప్రత్యేక అలంకారంలో దుర్గమ్మ

బద్వేలు, జూలై 19: పట్టణంలోని పోలీసుస్టేషన్ ఆవరణలో వెలసిన దుర్గమ్మ అమ్మవారికి వివిధ రకాల ప్రత్యేక కూరగాయలతో శుక్రవారం చేపట్టిన అలంకారం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారిని దర్శించుకునేందుకు ఉదయం నుంచే అధిక సంఖ్యలో హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు పూజారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చంద్రశేఖర్, నాగభూషణం, సుబ్బరాజా తదితరులు పాల్గొన్నారు.

అల్లాడుపల్లెలో వైద్య శిబిరం

చాపాడు, జూలై 19: మండలంలోని అల్లాడుపల్లె గ్రామాన్ని డీఎంహెచ్‌ఓ నాగరాజు, డీపీఓ భాస్కర్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఈ గ్రామంలో 16 మందికి డయేరియా సోకడంతో వీరంతా తిరిగి కోలుకున్నారు. తాగునీరు కలుషితం కావడంతో డయేరియా సోకిందని డాక్టర్లు రాజేష్‌కుమార్, ఓబులేసు చెప్పారు. శుక్రవారం కవిత అనే మహిళకు కూడా డయేరియా సోకింది. గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. బాధితులకు మందులు పంపిణీ చేశారు. కొందరు ప్రొద్దుటూరులోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. డయేరియా విజృంభించకుండా తగిన చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్లను ఆదేశించారు. ఇద్దరు జిల్లా అధికారులు గ్రామస్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. వారి వెంట ఈఓపీఆర్‌డీ క్రిష్ణవేణి, ఆరోగ్య విస్తరణాధికారి రాఘవయ్య, కుటుంబ డాక్టర్లు బాస్కర్ యాదవ్, రమేష్ తదితరులున్నారు.


గ్రామస్థులతో మాట్లాడుతున్న డీపీఓ భాస్కర్‌రెడ్డి

నాణ్యతతో కూడిన ఆహారాన్ని అందించాలి

ప్రత్యేక అధికారిపై మండిపడిన ఫుడ్ సేఫ్టీ కమిషన్ అధికారి

అట్లూరు, జూలై 19: కస్తూర్బా గురుకుల పాఠశాల విద్యార్థులకు నాణ్యతలేని ఆహారం ఇస్తుండడంతో పలురకాల ఇబ్బందులు పడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఏఎఫ్‌ఎస్‌ఓ తిరుపతి అధికారులకు ఫిర్యాదు చేశారు. తాగునీరు సక్రమంగా లేకపోవడంతో పిల్లలు కడుపునొప్పి, వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారని చేసిన ఫిర్యాదుపై శుక్రవారం ఫుడ్‌సేఫ్టీ కమిషన్ అధికారి సమీర్ షేర్‌ఖాన్ వసతిగృహాన్ని సందర్శించారు. భోజనశాల, భోజనం, కూరలను పరిశీలించి నాణ్యతా లోపాన్ని గుర్తించారు. వసతిగృహంలో పరిశుభ్రత లోపించిందని, విద్యార్థులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఇలాంటి ఫిర్యాదులు మళ్లీ వస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఓను హెచ్చరించారు.


పరిశుభ్రత లోపంపై అధికారికి వివరిస్తున్న తల్లిదండ్రులు

సీజనల్ వ్యాధుల పట్ల అప్రవత్తంగా ఉండాలి

పోరుమామిళ్ల, జూలై 19: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని రెసిడెన్సియల్ పాఠశాలల్లో దోమల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి నరసింహారెడ్డి అన్నారు. శుక్రవారం కేజీబీవీఎస్ బాలికల కళాశాలలో మందు పిచికారీ అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. జ్వరాలు, మలేరియా, డెంగ్యూ, మెదడు వాపు వ్యాధి సోకకుండా జాగ్రత్త చర్యలు తెలిపారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు పిఎఫ్ బాషా, రంగసముద్రం సర్పంచు చిత్తా రవిప్రకాశ్‌రెడ్డి, ఎస్‌పీడీసీ ముత్యాల ప్రసాద్, ప్రిన్సిపాల్ నాగమల్లేశ్వరి, ఆంగ్ల అధ్యాపకులు రెడ్డమ్మ తదితరులు పాల్గొన్నారు.

విషజ్వరాలు రాకుండా జాగ్రత్త పడండి

బి. కోడూరు, జూలై 19: విష జ్వరాల వలన వివిధ రకాల వ్యాధులు వస్తాయని విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని పోరుమామిళ్ల సబ్ యూనిట్ ఆఫీసర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సగిలేరు గురుకుల పాఠశాలలో విద్యార్థులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ ఆడ ఎనాఫిలిస్ దోమ కాటుతో మలేరియా, ఆడ క్యూలెక్స్ దోమకాటుతో ఫైలేరియా, మొదడు వాపు ఏడీఎస్ యూజిప్ట టైగర్ ముసుగులో దోమలు కాటు వేస్తాయని విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. పాఠశాల ఆవరణలో పాత టైర్లు, వాడి పడేసిన కొబ్బరి బొండాలు గచ్చులు తొట్లు, మురికి నీరు నిల్వలేకుండా చూసుకోవాలని తెలిపారు. ఎంపీడీఓ భాస్కర్ రావు మాట్లాడుతూ వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని తాగునీటిని కాచి చల్లార్చిన తరువాత తీసుకోవాలని వారు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, వైద్య సిబ్బంది, స్థానిక సర్పంచ్ గుర్రయ్య పాల్గొన్నారు.

మంచినీటి సమస్యపై స్పందించాలి : ఎమ్మెల్యే

జమ్మలమడుగు, జూలై 19: మండల పంచాయతీల్లో ఎక్కడా మంచినీటి సమస్య తలెత్తకుండా సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి సూచించారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో మండల సాధారణ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ఏ సమస్యఉన్నా ప్రజల నుంచి ఫిర్యాదులు రాకుండా సంబంధిత అధికారులు సమస్యలున్న ప్రాంతాలకు వెళ్లి పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. గండికోట పర్యాటక ప్రాంతమని, నీటి సమస్య పరిష్కరించాలని, ఇతర సమస్యలపై గత ప్రభుత్వం నుంచి అడుగుతున్నానని గండికోట సర్పంచ్ గురుఈశ్వర్ అన్నారు. సుగుమంచిపల్లె నుంచి పెద్దదండ్లూరు మధ్య పెన్నానదిలో వరదనీరు వస్తే దారి ఉండదని, గతంలో అనేక ఇబ్బందులు పడ్డామని పి.సుగుమంచిపల్లె సర్పంచ్ ఒంటెద్దు సుధాకర్‌రెడ్డి వివరించారు. చేనేత గ్రామాలైన మోరగుడి సమీప గ్రామాల్లో కరెంటు నిలకడగా ఉండడం లేదని చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీపీ హరిత మాట్లాడుతూ మండలంలో సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకునేందుకు అధికారులతో ప్రజలకు ఇబ్బంది కలగకుండా మంచినీరు, పారిశుధ్యంపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ముజఫర్, సర్పంచులు, మత్తయ్య, రామాంజనేయరెడ్డి, కొండయ్య, ఏఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీఎం గురుకుమార్, ఏఈ ఓబులేసు, గురుశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి రూ.20వేలు జమ చేయాలి

బద్వేలు, జూలై 19: తాము అధికారంలోకి వస్తే రైతులకు పెట్టుబడి సాయం అందజేస్తామన్న రూ.20వేలు రైతుల ఖాతాల్లో జమ చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరి రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్ పేర్కొన్నారు. శుక్రవారం తహసీల్దారుకు వినతిపత్రం అందించిన వారు మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, గత ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతకు తోడు, సూపర్ సిక్స్ పేరుతో కూటమి ఇచ్చిన హామీలు కూడా పెద్ద ఎత్తున ప్రభావం చూపాయన్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో వర్షాభావం కారణంగా కరువు, డిసెంబర్‌లో వచ్చిన తుఫాన్‌తో పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

కుష్ఠుపై అవగాహన కలిగి ఉండాలి

ఖాజీపేట, జూలై 19: ప్రతి ఒక్కరూ కుష్ఠుపై అవగాహన కలిగి ఉండాలని వైద్యాధికారి ముబీన్ అన్నారు. శుక్రవారం మండల పరిధి 11 సచివాలయాల్లో జాతీయ కుష్ఠునిర్మూలనపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ప్రతి ఇంటికీ ఏఎన్‌ఎం, ఎంఎస్‌హెచ్‌పీలు, ఆశా కార్యకర్తలు వెళ్లి సర్వే నిర్వహించాలన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి నాగభూషణం, హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణప్రియ, శోభన్‌బాబు, నోడల్ ఆఫీసర్ అరుణకుమారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో స్కానింగ్ మిషన్

ముద్దనూరు జూలై19: స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులను పరీక్షించే స్కానింగ్ మిషన్ అందుబాటులో ఉన్నట్లు డాక్టర్ కరిష్మ తెలిపారు. శుక్రవారం డాక్టర్ సుచరిత స్కానింగ్ మిషన్ ప్రారంభించారు. 10 మంది గర్భిణులకు స్కానింగ్ చేసి శిశువు ఆరోగ్యస్థితి పరీక్షించారు. గర్భిణులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానిక ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలను శుక్రవారం డాక్టర్ శ్రీకాంత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో వంట గది, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. సీజన్‌లో వచ్చే వ్యాధులపై వివరించి, తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు.

ఘనంగా షిర్డిసాయి గ్రామోత్సవం

ప్రొద్దుటూరు టౌన్, జూలై 19: వైఎంఆర్ కాలనీలోని షిర్డిసాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకల్లో భాగంగా స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. శుక్రవారం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజలు అనంతరం సాయిబాబా ఉత్సవ మూర్తిని వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. గురుపౌర్ణమి సందర్భంగా భక్తులకు అన్నదానం కోసం ధన, ధాన్య, వస్తు రూపంలో కానుకలు సమర్పించారు.

80.2 మి.మీ వర్షపాతం నమోదు

కాశినాయన,జూలై19: మండలంలో రెండు రోజులు గా ఓమోస్తారు వర్షాలు కురుస్తున్నట్లు తహసీల్దా రు కృష్ణ, డిప్యూటీ తహసీల్దారు ప్రసన్నలక్ష్మీ తెలి పారు. గురువారం నుంచి శుక్రవారం ఉదయం వర కు 70.2 మి.మీ వర్షం కురవగా శుక్రవారం ఉద యం నుంచి సాయంత్రం వరకు 10.మి.మీ వర్షపా తం నమోదైందన్నారు. ఇంకా రెండు మూడు రోజు లు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలియ పరుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ లైన్ల కింద నిలబడడం, పెంపుడు జంతు వులను కరెంట్ స్తంభాలు, చెట్లకింద కట్టేయరాదని, రైతులు వ్యవసాయ మోటార్లవద్ద అప్రమత్తతో వ్యవహరించాలని కోరారు.

కొండాపురంలో పలుచోట్ల వర్షం

కొండాపురం, జూలై 19: తుపాన్ ప్రభావంతో మండ లంలో పలుచోట్ల వర్షం శుక్రవారం కురిసింది. కొద్ది రోజులుగా మేఘాలు ముసురుకుని ఉన్నా వర్షం కురవక పోవడంతో రైతులు, ప్రజలు నిరాశతో ఉన్నారు. తుఫాన్ ప్రభావంతో చిరుజల్లులతో కూడి న వర్షం కురుస్తుండడంతో కొంత ఉపశమనం కలిగిందని చెప్పవచ్చు.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 19: రాష్ట్రంలో అధికారం చేపట్టిన టీడీపీ ప్రభుత్వం అంగన్వాడీ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఆర్.లక్ష్మీదేవి, జిల్లా కార్యదర్శి లక్ష్మీదేవి కోరారు. శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో అంగన్వాడీలు నిర్వహించిన 42 రోజుల సమ్మె పుస్తకాన్ని ఆవిష్కరించిన వారు మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా ప్రభుత్వ ఒత్తిడికి తలొగ్గకుండా 42 రోజులు అంగన్వాడీ వర్కర్లు సమ్మె చేయడం హర్షణీయమన్నారు. టీడీపీ నేతలు సమ్మెకు మద్దతు ప్రకటించి వర్కర్లకు జీతాలు పెంచుతామని గ్రాడ్యుటీ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, ఈమేరకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'వీఆర్‌ఓ సుధాకర్‌ను సస్పెండ్ చేయాలి'

బద్వేల్ రూరల్, జూలై 19: భూ కబ్జాదారులకు కొమ్ము కాస్తున్న చెన్నంపల్లె వీఆర్‌ఓ సుధాకర్‌ను రెవెన్యూ ఉన్నతాధికారులు వెంటనే సస్పెండ్ చేయాలని సీపీఐ రూరల్ కార్యదర్శి నాగదాసరి ఇమ్మానియేల్ డిమాండ్ చేశారు. శుక్రవారం 1580, 1567,1809 సర్వేనెంబర్లలో సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలో ఆయన మాట్లాడుతూ నకిలీ పట్టాలు సృష్టించుకుని లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటే రెవెన్యూ అధికారులు పోలేదన్నారు. ఆ భూమిలో కొంత కాలం కిందట ప్రభుత్వ భూమి బోర్డు అని పెట్టినా బోర్డును తీసివేయించి ఆక్రమిస్తున్నారని వీటి అన్నింటికీ వీఆర్‌ఓ సుధాకరే ప్రధాన సూత్రదారి అన్నారు. 17న ఆ ప్రాంతంలో రూరల్ సమితి ఆధ్వర్యంలో పేదలను సమీకరించి గుడిసెలు వేయించేందుకు ప్రయత్నించగా తహసీల్దార్ అడ్డుకున్నారని ప్రభుత్వ భూములు స్వాధీనం చేసుకుంటామని హామి ఇచ్చి తిరిగి బోర్డు నాటిన రెండు రోజులకే బోర్డు లేదని ఆక్రమణ దారులకు రెవెన్యూ అధికారులు సహకరిస్తున్నారన్న అనుమానాలు తలెత్తుతున్నాయన్నారు. త్వరలోనే వీఆర్‌ఓ సుధాకర్‌పై ఆర్‌డీఓ, కలెక్టర్‌లకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు హరికృష్ణ, సుధాకర్, ఓబులేసు, ఓబులయ్య, కల్యాణ్, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాధనాన్ని వృధా చేసిన వైసీపీ'

జమ్మలమడుగు, జూలై 19: వైసీపీ ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఇష్టారాజ్యంగా జరిగిందని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి దేవగుడి భూపేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రజాధనాన్ని వృధా చేసి భూ హక్కు పత్రం పేరుతో ప్రచారానికి రూ.13 కోట్లు ఖర్చు చేశారన్నారు. వైసీపీ జిల్లా కార్యాలయాల కోసం రెండేసి ఎకరాలు నామమాత్రపు రుసుంతో 33 ఏళ్ల లీజుకు ఇచ్చారన్నారు. కొండలను సైతం జగన్ అనకొండలా ప్రభుత్వ భూమిని మింగేశాడన్నారు. రుషి కొండలో రూ.500 కోట్లతో ప్యాలెస్ కట్టి రాష్ట్రంలో అభివృద్ధి లేకుండా చేశాడన్నారు. వైసీపీ పాలనలో అక్రమాలు, ఇతర దందాలు చేసి దోచుకున్నాడన్నారు. ల్యాండ్ టైట్లింగ్ పేరుతో దోపిడీకి పాల్పడ్డారన్నారు. దోపిడీ పాలనకు ప్రజలు ఇంటిదారి పట్టించారన్నారు. అక్రమాలు, దౌర్జన్యం, నశించిపోయిందన్నారు.

బీజేపీలోకి ఎస్వీ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ హరినారాయణ

ప్రొద్దుటూరు టౌన్, జూలై 19: శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఎ.హరినారాయణ బీజేపీలో చేరారు. శుక్రవారం విజయవాడలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందరేశ్వరి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీ శ్రేణులు హరినారాయణతో కలిసి బీసీల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళతామని, ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించడానికి కృషి చేస్తానని తెలిపారు. జిల్లా, రాష్ట్రంలో పార్టీ పటిష్ఠతకు పాటుపడతానన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోనేటి ప్రదీప్‌రెడ్డి, ప్రొద్దుటూరు అసెంబ్లీ కోకన్వీనర్ గౌరీశంకర్, రాష్ట్ర సాంస్కృతికశాఖ కన్వీనర్ భానుప్రకాష్ పాల్గొన్నారు.


రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరితో హరినారాయణ

ఎన్నికల హామీలు నెరవేర్చేదిశగా చర్యలు

అదనపు నిధులు తెచ్చి కూరగాయల మార్కెట్‌ను పూర్తిచేస్తాం

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి వెల్లడి

ప్రొద్దుటూరు, జూలై 19: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా చర్యలు ప్రారంభించామని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రొద్దుటూరులో అస్తవ్యస్థమైన డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించే పనులకు గత ప్రభుత్వంలోనే పనులు మొదలు పెట్టారు. అవి మున్సిపాలిటీ పరిధిలోనే వుండడంతో సోములవారిపల్లె, కొత్తపల్లె, గోపవరం, దొరసానిపల్లె పంచాయతీల్లో అనుసంధానం చేయవలసిన అవసరం వుందన్నారు. రాబోయే 30 ఏళ్లలో జనాభాను దృష్టిలో వుంచుకుని ప్రొద్దుటూరుకు వీటిని అనుసంధానించాల్సిన అవసరం వుందన్నారు. ఇప్పుడు పిలిచిన టెండర్లలో కేవలం మున్సిపాలిటీ వరకే వుండడంతో డ్రైనేజీ సమస్య పునావృతం అవుతుందన్నారు. ఈ పనులకు అదనంగా మరిన్ని కోట్లు ఖర్చయినా తిరిగి రీ డిజైన్స్ చేయమని పబ్లిక్ హెల్త్ ఎస్ఈ శ్రీనాధ్‌ను కోరామన్నారు. సర్వేచేసి మళ్లీ రిపోర్టు అందజేస్తామన్నారు. కూరగాయల మార్కెట్‌కు పార్కింగ్ ఏరియా పెంచడానికి మరో రెండు కోట్లు అదనమైనా చేపట్టాలని కోరామన్నారు. ప్రభుత్వంతో మాట్లాడి వీలైనంత త్వరగా నిధుల విడుదల కోసం కృషి చేస్తామన్నారు పాత మార్కెట్ రిజర్వాయర్ అక్కడే నిర్మించడం కంటే మరోచోటికి మార్చే అవకాశాలు చూడమని చెప్పామన్నారు.


మాట్లాడుతున్న నంద్యాల కొండారెడ్డి

తప్పుడు ధోరణి వైపు యువత వెళ్లకూడదు

బద్వేలు,జూలై 19: అవకాశవాద, తప్పుడు ధోరణి వైపు యువత వెళ్లకూడదని పాలకుల మాటలు, చేతలకు పొంతన ఉండడం లేదని యువజన సమాఖ్య మాజీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. గురువారం డీవైఎఫ్ఐ జిల్లా వర్క్‌షాపులో జిల్లా అధ్యక్షుడు ఎం.చిన్ని అధ్యక్షతన స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో 2024 ఎన్నికల్లో మూడో దఫా కేంద్రంలోకి అధికారంలోకి వచ్చిన బీజేపీ మత తత్వ రాజకీయాలకు పట్టు సడలించిందని, మిత్రపక్షాలపై ఆధారపడి అధికారంలోకి వచ్చిందన్నారు. రాష్ట్రంలో వైసీపీకి 11 సీట్లకే ప్రజలు పరిమితం చేశారన్నారు. కక్ష సాధింపు రాజకీయాలు, బాబాయ్ హత్య, చంద్రబాబు అరెస్టు, రాజధాని, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్, వైసీపీ పెద్దల ఆక్రమణలతో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా ఓడిపోయిందని, మాటలు, చేతలకు పొంతనలేని పాలనతోనే ఘోర పరాజయం పొందిందన్నారు.